

## జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తరలివెళ్లిన జనసైనికులు

విశాలాంధ్ర-సబ్బవరం : జనసేన పార్టీ అధినేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పిఠాపురంలో జరుగుతున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మండల కేంద్రం నుండి జనసైనికులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సబ్బవరం పంచాయతీ జనసేన నేతలు బంతికోళ్ల పద్మ, టీ.శేఖర్, జెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో జన సైనికులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీ నుండి జనసైనికులు అధిక సంఖ్యలో కార్లలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పల్లా రమణ, సబ్బవరపు రమణ, ఎన్. కొండబాబు, జి. మన్మధరావు, గొల్ల అర్జున్, కొల్లి కృష్ణ, జన సైనికులు, వీర మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై ఈనెల 21న మహాధర్నా

**రైతు, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం**

విశాలాంధ్ర-చోడవరం : గోవాడ సుగర్స్ లోని సమస్యలపై ఈ నెల 21 న మహాధర్నా నిర్వహించనున్నట్లు కార్మిక, రైతు, ప్రజా సంఘం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఏ.పి.రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, రైతు కూలీ సంఘం నాయకులు మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి వెంకన్న, సిఐటీయు జిల్లా నాయకులు శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల బకాయిల చెల్లించాలని, ప్రభుత్వం ఫ్యాక్టరీ ఆధునికరణ కై నిధులు కేటాయించి ఆదుకోవాలని, తక్షణమే ఫ్యాక్టరీ రిపేర్లకు 35 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్లు పై ఈ సమావేశం తీర్మానం చేసింది. ఫ్యాక్టరీని ఇక్కడ రైతాంగం, ప్రజలు కాపాడుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని దీని కోసమే ఈనెల 21వ తేదీన గోవాడ ఫ్యాక్టరీ వద్ద మహా ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ మహా ధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీ పరిధిలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని ఏ రోజు ఫ్యాక్టరీ ఆగిపోతుందో తెలియక తీసుకొచ్చిన చెరుకు ఎండకు ఎండి రికవరీ రాక రైతాంగం, ఫ్యాక్టరీ నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏనాడు లేని ఈ దుస్థితి కి కారణమైన విధానాలపై రైతాంగం పెద్ద ఎత్తున పోరాడాలని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజనకు చెరకు లేక ఫ్యాక్టరీ మూతపడే పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మూతపడితే ఈ ప్రాంతమంతా ఎడారిగా మీరే ప్రమాదం ఉందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని సహకారంగంలో నడుస్తున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. రైతులు, కార్మికులు బకాయిలకై, ఆధునికరణకై ప్రభుత్వం తక్షణ సాయంగా 35 కోట్లు, ఆధునీకరణ కై 110 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ ఫ్యాక్టరీ లేకపోతే ఈ ప్రాంతంలో రైతులు, కార్మికులు రోడ్డున పడతారన్నారు. ఈ సమావేశానికి రైతు సంఘం నాయకులు ఎస్ వి.నాయుడు అధ్యక్షత వహించగా జి. నాయన బాబు, ఆర్ దేముడు నాయుడు, ఈ.ఎస్ మూర్తి, దేముళ్లు, డి తాతారావు, నర్సింగరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఏ అప్పలనాయుడు, వి సత్యం, కోన మోహనరావు, దొర తదితరులు పాల్గొన్నారు.

## 16న సీపీఐ మండల మహాసభలు

విశాలాంధ్ర-కే కోటపాడు : ఈనెల 16వ తేదీన సిపిఐ మండల మహాసభలు నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి గొర్లె దేవుడి బాబు ఒక ప్రకటంలో తెలిపారు. ఆనాటి సభలో పేదలకు ఇళ్ల పట్టాల సమస్యపై చర్చించడం జరుగుతుందన్నారు. అలాగే గోవాడ చక్కెర కర్మగారంపై ప్రభుత్వం చేస్తున్న అలసత్వం కారణంగా అనేక మంది చెరకు రైతులు నష్టాల బారిన పడ్డారని, తక్షణమే షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని ఆనాటి సభల్లో డిమాండ్ చేస్తామన్నారు. ఈ సభలకు జిల్లా కార్యదర్శి బాలేపల్లి, సహాయ కార్యదర్శి రాజానదొరబాబు తో సహా అనేకమంది జిల్లాస్థాయి నాయకులు పాల్గొంటారని, సిపిఐ శ్రేణులు మహాసభలను జయప్రదం చేయాలని ఆప్రకటనలో కోరారు.

## నాగులపల్లి గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాలి

**అఖిలపక్ష నేతలు డిమాండ్**

విశాలాంధ్ర-అనకాపల్లి: మండలంలోని మూలపేట గ్రామం శారద నది దగ్గర గల నాగులపల్లి గ్రోయిన్‌ను గ్రామ అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కోన లక్ష్మణ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు, రైతులు సందర్శించి గ్రోయిన్ మరమ్మతులు వెంటనే చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి పరిసర గ్రామాల రైతులకు వ్యవసాయానికి సాగు నీరు, అనకాపల్లి పట్టణం, పరిసర ప్రాంతాలకు తాగునీరందిస్తున్న నాగులాపల్లి గ్రోయిన్ దశాబ్ద కాలంగా శిథిలావస్థకు చేరి ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఏప్రిల్,మే, జూన్ వేసవిలో ఎండల తీవ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున నదుల్లో నీరు ఇంకిపోయి సుమారు 10 గ్రామాల ప్రజలు, పట్టణం ప్రాంత ప్రజలు, తాగునీరు, రైతులు వ్యవసాయానికి సాగునీరు అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందునస్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి గ్రోయిన్ మరమ్మత్తులు చేపట్టిన యెడల రైతులతో కలిసి ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి ఇన్ ఛార్జ్ కొణతాల హరినాథ్ బాబు, బహుజన సమాజ్ పార్టీ నియోజవర్గం ఇన్‌ఛార్జ్ సూదికొండ మాణిక్యాలరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి కోరుబిల్లి శంకర్రావు, రైతులు బొర్ర రాజు, రాము పాల్గొన్నారు

## విశాలాంధ్ర ఎఫెక్ట్...
## బి.ఎన్.రోడ్డులో కబ్జాలను కూల్చివేసిన అధికారులు

విశాలాంధ్ర-చోడవరం : ఈనెల 11న విశాలాంధ్రలో ప్రచురితమైన వార్తకు స్పందనగా అధికారులు శుక్రవారం బి.ఎన్. రోడ్డులో తల్లి పిల్లల ఆసుపత్రి ఎదురుగా కబ్జా చేసి డ్రైనేజీపై నిర్మించిన కట్టడాలను కూల్చివేశారు. పట్టణంలో పలుచోట్ల స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారుల అండ దండలతో యదేచ్ఛగా భూకబ్జాలు ఊబందుకున్నాయి. కబ్జాలకు కేరాఫ్ చోడ'వరం'గా మార్చిన ప్రజా ప్రతినిధులు అధికారులు తీరు పలు విమర్శలకు తావిస్తోంది. పట్టణం ఏ విధంగానూ అభివృద్ధి చెందకపోయినను కబ్జాలకు కేరాఫ్ గా మారుతోంది. గతంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు, రోడ్డు విస్తరణతో ప్రధాన రహదారుల్లో కబ్జాలను నివారించగలిగారు. కూటమి ప్రభుత్వం అందలం ఎక్కాక ఎమ్మెల్యే అండతో బి.ఎన్. రోడ్డులో కబ్జాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. దీనిపై ప్రశ్నించే నాధుడే కరువయ్యాడు. ఎమ్మెల్యే రాజు, ప్రభుత్వ అధికారులు కబ్జాలకు వంత పాడడంతో భూఆక్రమణదారులు యదేచ్ఛగా రోడ్లు, డ్రైనేజీలు వేటినీ వదలకుండా కబ్జాలు కొనసాగిస్తున్నారు. అధికారులకు, చోటా కూటమి నేతలకు డబ్బు కొట్టు స్థలం పట్టు అన్న చందంగా చోడవరం మారింది. పంచాయతీ స్థలాల్లోను, డ్రైనేజీలను అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. చీడికాడ రోడ్లో పోలమాంబ గుడి పక్కన, చోడవరంలో పెద్ద వ్యాపారస్తుడు పంచాయతీ స్థలంలో ఎటువంటి అధికారిక అనుమతులు లేకపోయినా, షాపింగ్ కాంప్లెక్స్ కట్టుకోడానికి సిద్ధపడుతున్నారు. అధికారులకు తెలిసినను పట్టించుకోలేదని మహిళ, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే రాజు రోడ్లు విస్తరణ త్వరలో చేపడతామంటూ ప్రకటించారు. ఇంతలోనే ఎమ్మెల్యే రాజు, ఆదికారులు అండ దండలతో భూకబ్జాలకు తెర తీయడం దేనికి సంకేతమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అమాయకులను బలి చేసేందుకా, లేక వ్యాపారస్తుల నుండి డబ్బు దండుకునేందుకు ఎమ్మెల్యే, అధికారుల పన్నాగమా అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

## గురుకుల విద్యాలయాలలో ప్రవేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : 2025- 26 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దళికాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ వి.వి. రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 వ తరగతులు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరుటకు మార్చి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్లైన్ విధానంలో https://aprs.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25వ తేదీన ఉదయం, కళాశాలలో ప్రవేశాలకు అదేరోజు మధ్యాహ్నం ప్రవేశపరీక్ష నిర్వహించ బడుతుందని తెలిపారు. కావున ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గురుకుల విద్యాలయాలలో ప్రవేశాలు పొంది, చక్కటి విద్యను అభ్యసించాలని కోరారు.

## విశాఖ ఉక్కును యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం సామర్థ్యంతో నడిపించాలి

విశాలాంధ్ర-పరవాడ : విశాఖ ఉక్కు పరిశ్రమను ఉక్కు యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం పూర్తి సామర్థ్యంతో నడిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. విశాఖ ఉక్కు యాజమాన్య మొండి వైఖరి నశించాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను ఎవరినీ తొలగించకూడదదని, యూనియన్ నాయకులపై బెదిరింపులకు దిగడం ఉక్కు యాజమాన్యానికి తగదని, ఉక్కు కార్మిక నాయకుడు అయోధ్య రాముకు ఇచ్చిన నోటీస్ వెంటనే ఉపసంహరించుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఆర్ఐఎన్ఎల్ స్టీల్ ప్లాంట్ ను సెయిల్లో విలీనం చేయాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.నాయుడు, జి శ్రీనివాసరావు, ఎన్ గురునాధరావు, బి శ్రీను, కె. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హత్య చేసిన వ్యక్తి అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు

విశాలాంధ్ర -చోడవరం : చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘర్షణ హత్య కేసులో క్రైమ్ నెంబర్ 55 / 25 ముద్దాయి అరెస్టుపై స్టేషన్ సీఐ అప్పలరాజు శుక్రవారం పత్రిక సమావేశం నిర్వహించారు. సిఐ అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 3 వ తేదీ రాత్రి 9.30 గంటలకు చోడవరంలోని బాలాజీ నగర్ వద్ద ఇందల సన్యాసిరావు (64) నెమాల హరి (చోడవరం పంచాయతీ 10వ వార్డు మెంబెర్ భర్త, టీ.డి.పి. నాయకుడు) మధ్య గొడవ జరిగింది. ఆ గొడవలో నెమాల హరి, ఇందల సన్యాసిరావు ని బలంగా చేతులుతో గుద్ది, క్రిందకి తోయడము వలన ఇందల సన్యాసిరావు సిసి రోడ్ పై పడిపోవడంతో తలకు బలమైన గాయమై, కెజిహెచ్ లో చికిత్స పొందుతున్నారు. దీనిపై ఈ నెల 4 న చోడవరం పోలీస్ పోలీస్ స్టేషన్ లో ఇందలి నాగేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడి దర్యాప్తు జరుగుతుండగా, ఈ నెల 12 న ఈ కేసులో గాయపడిన ఇందల సన్యాసిరావు కెజిహెచ్ లో చికిత్స పొందుతూ చనిపోయారు. పిదప కేసు ను అలర్ట్ చేసిన చోడవరం ఇన్స్పెక్టర్ కార్తీక్ పోలీస్ సిబ్బంది కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటలకు చోడవరం ఐటిఐ కాలేజీ వద్ద చోడవరం కు చెందిన బానయ్యకొనేరు నివాసి అయిన ముద్దాయి నేమాల హరి ని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం హాజరు పరచినట్లు సిఐ అప్పలరాజు తెలిపారు.

## స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ ద్వంద్వ వైఖరి మానుకోవాలి : సీపీఐ, సిఐటియు

విశాలాంధ్ర-అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ పై ప్రభుత్వం తన ద్వంద వైఖరిని మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్రావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం లో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన నిరసన తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు స్వంత గనులు కేటాయించాలని,ప్లాంట్ నడవడానికి నిధులు కేటాయించాలని,కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 11 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని, ఇచ్చిన డబ్బులు ప్లాంట్ నడవడానికి, జీతాలు, ముడిసరుకు ఖర్చు పెట్టవద్దని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాత అప్పులు కింద ఈ ప్యాకేజీ తీసుకుంటున్నారని ఇలా ఐతే ప్లాంట్ ఎలా నడుస్తుందని కావాలనే బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ని నష్టాల సాకు చూపి ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని. ప్రజల ఆస్థి ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలిసిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాకముందు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటామని నిధులు తెచ్చి ప్లాంట్ నడిచే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారని నేడు స్టీల్ ప్లాంట్ సమస్యను పట్టించుకోవడంలేదని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రవేట్ పరం చేయాలని ఆలోచనతోనే గనులు కేటాయించడం లేదని ఇంకా పనులు ప్రారంభం కానీ మెటల్ స్టీల్ ప్లాంట్ కు మాత్రం గనులు ఇవ్వాలని చంద్రబాబు నాయుడు మోడీ ని కలిశారని ప్రభుత్వ రంగం అంటే ఎంత చిన్న చూపు దీనిని బట్టి అర్థం అవుతుందని స్టీల్ ప్లాంట్ కార్మికులకు గత నాలుగు నెలలుగా పూర్తి జీతాలు చెల్లించడం లేదని కాంటాక్ట్ కార్మికులను తొలగిస్తున్నారని ఇది సరైనది కాదని సీఎం రమేష్ ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ విషయమై డైరెక్ట్ గా ప్రధాని మోడీతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పాడని ఈ రోజు ఆయన అదే గతి లేకుండా ఉన్నారని చేతనైతే స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని లేకపోతే పదవికి రాజీనామా చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ . దొరబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంట శ్రీరామ్, ఏ రాజు, కె.తేలయ్యబాబు, జి.సుభాషిని, అప్పారావు,సిపిఐ నాయకులు ఆరు అప్పలరాజు కే.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-సబ్బవరం : ప్రభుత్వ వివిధ కార్పొరేషన్ ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేసేందుకు అర్హులైన లబ్దిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో వి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్దిదారులకు వ్యవసాయం / అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

## రంగుల రంగేళి... హోలీ పూర్ణిమ సంబరాలు

విశాలాంధ్ర-చోడవరం :హెూలీ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం రంగుల రంగేళి తో సంబరాలు జరుపుకున్నారు. అత్యంత ఆనంద ఉత్సాహాలు మధ్య చిన్న, పెద్ద తేడా లేకుండా రంగులను ఒకరిపై ఒకరు చల్లుకొని హెూలీ పూర్ణిమ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నాడు కలియుగ దైవం వెంకటేశ్వరని కళ్యాణం అనంతరం ఐదవ రోజున నాగవల్లి వసంతోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. కాల క్రమేణ రంగుల రంగేళీ గా రూపాంతరం చెందినదని నానుడి. గుడ్ ఫ్రైడే శుక్రవారం సెలవు దినం కావడంతో ఆడ, మగ చిన్న పెద్ద తారతమ్యాన్ని మరిచి ఒకరిపై ఒకరు రంగుల జల్లుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తో ఆనందంగా గడిపారు.

## వడ్డాది వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది గిరిజాంబ కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి 152 వ కళ్యాణోత్సవాల్లో భాగంగా చక్రస్నానం,నాగవల్లి కార్యక్రమాలు ఆలయ నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నాగవల్లి నిర్వహణ చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో వేకవజాము నుండి క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. మెట్ల మార్గం రోడ్ల మార్గం భక్తజన సందోహంతో గోవింద నామస్మరణతో గిరిజాంబ కొండ నమో వెంకటేశాయ నామస్మరణతో మారుమ్రోగింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుండి మెట్ల మార్గం రోడ్డు మార్గం వరకు భక్తులతో వీధులన్నీ నిండిపోయాయి స్థానిక బి ఎన్ రోడ్డు లో కొంతమేర ట్రాఫిక్ జామ్ కలిగినప్పటికీ స్థానిక ఎస్సై శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది చొరవతో వెంటనే ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టి శాంతి భద్రత లకు ఎటువంటి విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా స్వామివారి దర్శనం కలిగింది. ఆలయ మెట్ల మార్గం ద్వారా భక్తులుకు మజ్జిగ పులిహోర ప్రసాదాలు పంపిణీ మధ్యాహ్నం కొండ దిగువన భక్తులకు అన్నదానం చేశారు.

## ఘనంగా 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం

విశాలాంధ్ర-యలమంచిలి : మండలంలోని ములకలాపల్లి గ్రామం నందు గల మైహెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ)లో ఈనెల తేది 04 నుండి తేది 10 వరకు జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగింపు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం నాడు ఫ్యాక్టరీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జాయింట్ చీఫ్ ఇనస్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ జె. శివ శంకర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ జి వి. వి. ఎస్ నారాయణ, ఇనస్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ బి.కె.సుధాకర్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారని ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి. రామస్వామి అన్నారు. ఈ సందర్భముగా జాయింట్ చీఫ్ ఇనస్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ జె. శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీ నందు అందరూ ఎస్. ఓ. పి. ఫాలో అవాలని, మీకు నిర్ణయించిన సేఫ్టీ పరికరాలు తప్పకుండా దరించి ఏవిధమైన ఆటంకాలు లేకుండా పని చేసుకోవాలని అన్నారు. డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ జి.వి. వి. ఎస్ నారాయణ మాట్లాడుతూ ఈ భద్రతా వారోత్సవాలు సందర్భముగా నిర్వహించిన పోటీలలో విజేతలకు, పాల్గొన్న వారు అందరికీ అభినందనలు తెలిపారు. భద్రతతో పని చేస్తూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఫ్యాక్టరీ నందు అవలంభిస్తున్న సేఫ్టీ గురించి కొనియాడారు. ఇనస్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ బి.కె. సుధాకర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మీరు ఆరోగ్యంగా ఉండి పని ప్రదేశాలలో సేఫ్టీ పరికరాలు దరించి ఏవిధమైన వ్యాధులకు గురి కాకుండా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సీనియర్ జిఎం బి.రామ స్వామి, సినియర్ డి.జి. ఎం (పి.అండ్.ఎ) ఎల్. శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్ (సేఫ్టీ) కె. సతీష్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## డీఎస్సీ కోచింగ్ వెబ్ ఆప్షన్స్ నేడే ఆఖరి రోజు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు విడుదల చేయబోయే మెగా డి.ఎస్.సి. పరీక్షకు కు హాజరు అయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించుటకు వెబ్ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి కె. రాజేశ్వరి తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన షార్ట్ లిస్టు చేయబడిన అభ్యర్థులు వారి ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ సంస్థలు కేటాయించుటకు గాను వెబ్ ఆప్షన్స్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెబ్ ఆప్షన్స్ "సర్వీస్ జన్మభూమి", https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావున షార్ట్ లిస్ట్ చేయబడిన ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులు కోచింగ్ సెంటర్ ఎంచుకొనుటకు నేడే తమ ప్రాధాన్యతను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## వేసవి ఎద్దడిని గుర్తించి తాగునీటి అవసరాలు తీరుస్తున్న జడ్పిటిసి రాంబాబు

**రాంబాబును అపర భగీరధుడిగా కీర్తించిన చిట్టియ్య పాలెం గ్రామస్తులు**

విశాలాంధ్ర -బుచ్చయ్యపేట: మండలంలోని చిట్టియ్య పాలెం గ్రామంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి కారణంగా చిట్టియ్య పాలెం వైఎస్ఆర్సిపి నాయకులు కోరిక మేరకు జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర సహకారంతో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో జిల్లా జడ్పిటిసి ఫోరం అధ్యక్షులు దొండ రాంబాబు అభివృద్ధి నిధుల నుండి చిట్టియ్య పాలెం గ్రామానికి మూడు త్రాగునీటి బోరులు కు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి మూడు త్రాగు నీటి బోర్లు ఏర్పాటు చేసి మనుషులు కు పశువులు కు రాబోయే వేసవి లో నీటి ఎద్దడి తీర్చిన జడ్పీటీసీ రాంబాబు ని అపర భగీరధుడిగా కీర్తించారు కార్యక్రమంలో గ్రామ వైస్సార్సీపీ నాయకులు పెద్దలు యువకులు జడ్పీటీసీ సన్మానం చేయారు ఈ కార్యక్రమం లో మండలంలో ఉన్న వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు యువకులు అందరూ పాల్గొన్నారు.

## సభకు తరలిన జన సైన్యం

విశాలాంధ్ర-అచ్యుతాపురం : పిఠాపురంలో నిర్వహించే జనసేన ఆవిర్భావ సభకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ , సుందరపు సతీష్ ఆధ్వర్యంలో భారీగా జనసైనికులు తరలి వెళ్లారు. శుక్రవారం మండల కేంద్రమైన అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలి నుండి 2000 బైకులతో భారీగా జనసైనికులు తరలివెళ్లారు. మత్స్యకార గ్రామమైన పూడిమడక జనసైనికులతో పాటు అధిక సంఖ్యలో జనసైనికులు తరలివెళ్లారు.

## మత్స్యకారులకు తక్షణమే వేట నిషేధ సాయం అందించాలి

విశాలాంధ్ర-రాంబిల్లి : సిపిఎం పార్టీ ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మండలంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం కొత్తపట్నం మత్స్యకారుల గ్రామాన్ని సందర్శించి, మత్స్యకారులను వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకారులకు వేటనిషేధ సహాయం ఏడాదికి రూ.20లు అందిస్తామని చెప్పి నేటికి సంవత్సరం పూర్తయిన ఇప్పటికీ మత్స్యకారులకు వెంటనే సహాయం అందలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే నేవల్ బేస్ వలన మా ఉపాధి పూర్తిగా దెబ్బతిన్నదని తమకు ఎన్ ఏ ఓ బి నిర్మాణంలో నిర్మాణ పనులకు అర్హులైన వారు ఉన్నప్పటికీ స్థానికుల పేరుతో నిర్మాణ కంపెనీలు ఉపాధి కల్పించడం లేదని వాపోయారన్నారు.తాము నావెల్ బేస్ కు తమ శారద, వరాహ నదులు మా భూములు ఇవ్వడం తప్పదని, ఇప్పటికీ ప్రభుత్వం మాకు ఇస్తామన్న ప్యాకేజీ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా అనేక ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. చేపల వేటతో పాటు,తాము ముఖ్యంగా ఆధారపడి జీవించే జీడి తోటలు కౌలుకు తీసుకుని జీవిస్తామని, అటువంటి జీడి పంట తమ చేతికి వచ్చేసరికి గిట్టుబాటు ధర లేకుండా పోతుందని అన్నారు. 80 కేజీల జీడి బస్తాకు 16 వేల రూపాయల మద్దతు ధర ప్రభుత్వం కల్పించి జీడి పంట రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మండల ఆఫీసుల వద్ద ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ధోని కాసియా, నాగు మంత్రి నారాయణరావు, చోడుపిల్లి అప్పలరాజు, యూ అప్పారావు, సిహెచ్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మునగపాక: చెట్టుపై నుండి పడి దొడ్డి మహేశ్వరరావు (68) అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందారు.వివరాల్లోకి వెళితే మూలపేట గ్రామంలో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్న దొడ్డి మహేశ్వరరావు అనే వ్యక్తి రోజువారి కూలిపనుల్లో భాగం శుక్రవారం మధ్యాహ్నం చింత చెట్టు ఎక్కి ప్రమాదశాత్తూ జారిపడి మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తులు,భార్య వున్నారు. ఈ మధ్యకాలంలో కుమార్తె భర్తతో పాటు పెద్ద కుమారుడు ప్రమాదశాత్తూ మరణించారు.ఆ కుటుంబానికి పెద్ద దిక్కువగా వుంటున్న మహేశ్వరరావు ఆదాయంతోనే ఆ కుటుంబ జీవనం సాగిస్తుంది.ఈ మృతితో ఆ కుటుంబా తీరని దుఃఖసాగరంలో మునిగింది.మహేశ్వరరావు మృతితో కుటుంబం రోడ్డునపడిరదని ఆ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**విశాలాంధ్ర-కే.కోటపాడు :** ఈ మండలం పైడం పేట గ్రామంలో నూతనంగా నిర్మించి న మోదకొండమ్మ ఆలయ ప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు గుల్లేపల్లి మల్లంపాలెం పాచిలవానిపాలెం చౌడువాడ గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

# కేంద్రీయ విద్యాలయానికి అచ్చియ్యపేటలో శాశ్వత భవనం నిర్మించాలి

**- ఎంపీ సీఎం రమేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి**
**- సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం**

**విశాలాంధ్ర-అనకాపల్లి :** మండలంలో సుంద రయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో సర్వే సంఖ్య 511 కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన పది ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు వెంటనే చేపట్టాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్చియ్యపేట గ్రామంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లికి కేంద్రీయ విద్యా లయాన్ని మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసి అనకాపల్లి ఉడ్ పేట పాఠశాల ప్రాంగణంలో గతంలో సిద్ధం చేసిన భవనాలు, తరగతి గదుల్లో 2024-25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తారని చెప్పి నేటికీ కూడా ప్రారంభించలేదని అన్నారు. 28 కోట్లు 74 లక్షలు రూపాయలు కేటాయించారని అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, 25% సీట్లు స్థానికులకు ఇవ్వాలని, భూమి కోల్పోయిన నిర్వాసితులకి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం హయాంలో శ్రీకారం చుట్టారని, కేటాయించిన స్థలంలో రూ.20 లక్షంతో వంతెన నిర్మాణాన్ని చేప ట్టారు. ఈ స్థలంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు కోసం రూ. 6 లక్షలు వెచ్చించారు. రూ. 9 లక్షలతో ప్రాంగణంలో తుప్పలు, వ్యర్థాలు తొలగించారు. స్థలంలో తొలగించిన చెట్లకు రూ. 4 :20 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు ప్రకటించారని అయినప్పటికీ దాని ఆచరణలు తదుపరి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపట్టారు. అనకాపల్లి ఎంపీగా బిజెపి నుంచి సీఎం రమేష్ ఎన్నికయ్యారని అయినప్పటికీ ఎంపి చాలా నిర్లక్ష్యంగా ఉన్నాన్నారు. ఎన్నికల ముందు కేంద్రీయ విశ్వవిద్యాలయం తీసుకొస్తామని ఎన్నో కబుర్లు చెప్పి గెలిచిన తర్వాత పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ భూములను పెద్దలు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండింస్తూన్నామన్నారు. ఈస్థలంలో కేంద్రీయ విద్యాలయం కట్టకపోతే ఆ భూములను రైతులకి వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అలాగే గత ప్రభుత్వ

నిర్మించిన జగనన్న కాలనీలో పరిశీలించారు. అసంతృప్తిగా ఉన్నాయని, వీటిని వెంటనే అభివృద్ధి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, బి. ఉమామహేశ్వర రావు, కె.తేలయ్యబాబు, గొర్రెల మేకల పెంపకం దారులు జిల్లా అధ్యక్షులు ఉరిగిటి శివ సుర్యనారాయణ, రైతు సంఘం నాయకులు గండి నాయిన బాబు, వార్డు మెంబర్ ఉరిగిటి ఆదినారాయణ, ఉరిగిటి మహాలక్ష్మి నాయుడు, సుబ్బి సత్యారావు, పాము గోవింద, గొర్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం

**విశాలాంధ్ర-యలమంచిలి :** పట్టణంలోని జిమ్మిల్ రోడ్ జంక్షన్ హరిజన వాడలో గత విశాఖ డైరీ చైర్మన్ ఆడారి తులసి రావు జ్ఞాపకార్థం నిర్మాణం చేసిన నూతన రామాలయంలో సరస్వతీ సమేత వినాయక, సీతా రామలక్ష్మణ హనుమాన్ వారి విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం నాడు విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తులసి రావు కుమార్తె మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రామాకుమారి దంపతులు, ఆనంద్ దంపతులు చేతుల మీదగా ప్రతిష్ట జరగగా, ఆలయ ప్రాంగణంలో 12 గంటల నుండి సుమారు 10000 మందికి అన్నసంతర్పణ కార్యక్రమం, అనంతరం కలిసి సంస్కృతి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రతిష్ట మహోత్సవంలో జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పివిఆర్ మాధవ్, విశాఖపట్నం జిల్లా మాజీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, విశాఖ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పరమేశ్వర్, బిజెపి రాష్ట్ర నాయకులు ఎస్ ఆర్ కె శివాజీ రాజా బహదూర్, బడే రవి కిరణ్, వి బి సి అధినేత చక్రపాణి, ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచార జనార్దన్, టిడిపి నాయకులు ఆడారి రమణబాబు, ఆడారి ఆదిమూర్తి, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీను, విశాఖ డైరీ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఆలయ కమిటీ వారు పాల్గొన్నారు.

## ఎల్ బి పి అగ్రహారం నూతన సర్పంచిగా ముల్లి శ్రీను ప్రమాణ స్వీకారం

**విశాలాంధ్ర-బుచ్చయ్యపేట :** మండలంలో ఎల్బీపీ అగ్రహారం గ్రామంలో గత ఎడాది డిసెంబర్ నెలలో అనారోగ్యం తో మృతి చెందిన గ్రామ సర్పంచ్ తమరాన శ్రీను(వైసీపీ) స్థానంలో వైస్ ప్రెసిడెంట్ పనిచేస్తున్న మొల్లి శ్రీను ను(వైసీపీ) నూతన సర్పంచ్ గా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేసారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు గ్రామస్తులు యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## దేవిపురంలో ఘనంగా ముగిసిన సహస్ర పూర్ణ చంద్ర దర్శనం ఉత్సవం

**విశాలాంధ్ర-సబ్బవరం :** మండలంలోని దేవిపురంలో శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో గురు మాత శ్రీ అన్నపూర్ణాంబ గారి సహస్ర పూర్ణ చంద్ర దర్శనం ఉత్సవం వైభవోపేతముగా గురువారం సాయంత్రం గురుపాదుకా పూజ తో ఘనంగా ముగిసింది. బుధవారం సప్తగ్రహ మండపం, బ్రహ్మ మండపం సర్వతోభద్ర మండపం రుద్ర మండపం సంవత్సర ఆయనాది కలశ స్థాపనలు పూజలు జరిగాయి. ఋత్విక్కులు మృత్యుంజయ జపాలు, నవగ్రహ జపాలు ,ఆయుష్య సహిత పారాయణ,జన్మ నక్షత్ర జపాలు అశ్వత్థనారాయణ జపం అశ్వత్థవృక్ష ప్రదక్షిణ జరిపారు. సమాంతరముగా మన దేశము నుండే గాక వివిధ ప్రాంతాల నుండి మరియు విదేశాలు యూఎస్ఏ, యుకె, కెనడా నుండి వచ్చిన అనేక శిష్యులు ఉదయము నుండి శ్రీ వల్లభేశ, క్షేత్ర పాల దశ మహావిద్య సహిత శ్రీ విద్యా ఆమ్నాయ కలశ స్థాపన, మంత్ర జపాలు, తర్పణాలు, యంత్ర పూజలు, సహస్ర దూర్వార్చన, సహస్ర మోదక లలితా త్రిశతి, లలిత సహస్రనామార్చనలు భక్తులు గావించారు. సమాంతరంగా ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా సహస్రాక్షి అమ్మవారి పంచమృత అభిషేకం కిక్కిరిసిన భక్తుల వేద మంత్రాల నడుమ జరిగింది. గురువారం ఉదయము నుండి ఆమ్నాయ హోమం, నక్షత్ర ఆయుష్య, మహామృత్యుంజయ, మహావిద్యా హవనాలు ఆ తదుపరి పూర్ణాహుతి దశ దానాలు ఇచ్చిన తదుపరి వేద సదస్సు జరిగింది.సాయంత్రం గురు పాదుక పూజ భజనలతో కార్యక్రమం ముగియనున్నది. సాయంత్రము 4 గం నుండి గురు పాదుకా పూజ, పాటల నృత్యాలు, భజనలతో బాటు అమృత కన్యా గురుకులం బాలికలు స్వహస్తాలతో చేసిన సైన్స్ ప్రాజెక్ట్స్ ప్రదర్శించారు. గురుకులం అధ్యాపకులు శ్రీ మూర్తి, వార్డెన్ శ్రీమతి రమాదేవి రచించి సమర్పించిన పద్య, గేయాలు, లఘు నాటికలతో నేటి కార్యక్రమం ముగిసింది. క్రతువులు మహాద్భుతం గా జరిగాయి. అనంతరం గురుమాత అందర్నీ ఆశీర్వదించి బహుమతులు అందజేసినారు. ఈ కార్యక్రమంలో దేవిపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, శ్రీవిద్య ట్రస్ట్ కార్యదర్శి కందర్ప రమా, ట్రస్ట్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా టీడీపి

**విశాలంధ్ర-అచ్యుతాపురం :** కష్టపడిన ప్రతి కార్యకర్తకు టీడీపి అండగా ఉంటుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎలమంచిలి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు . శుక్రవారం మండలంలో శిల్ప లేఅవుట్ లో గల ఫంక్షన్ హాల్ లో మండల తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రీ సాయికృష్ణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, యువ నాయకులు లాలం భరత్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రగడ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజలతో మమేకమై , ప్రజల మేలుకొరకు పనిచేస్తుందన్నారు. టీడీపి అధినాయకత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో బూతులు వారీగా కుటుంబ సాధికారిక సారదలను నియమించాలని, ప్రతి 60 మంది ఓటర్లకు సాధికార సభ్యులను గుర్తించి, టీడీపి అభ్యున్నతకు తోడ్పడాలని, త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జనపరెడ్డి నరసింగరావు, టీడీపి జిల్లా కార్యదర్శి పీలా తులసిరాం, టీడీపి నాయకులు మేరుగు బాపునాయుడు, టిఎన్టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నమల్ల కొండబాబు, టీడీపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు .

## తుమ్మపాలలో ప్రభుత్వ నిబంధనలు వర్తించవా?

**అనుమతులు లేని లేఅవుట్లు, నిర్మాణాలపై చర్యలు తీసుకోరా?**
**పంచాయతీ అధికారులు అక్కడ ప్రత్యేక జీవోలు ఏమైనా జారీ చేశారా?**
**ప్రభుత్వానికి ఆదాయం రావడం వారికి ఇష్టం లేదా?**
**అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా... సర్దుకుపోతారా?**



**విశాలాంధ్ర-అనకాపల్లి :** మండలంలోని మేజర్ పంచాయితీ తుమ్మపాల పంచాయతీ అధికారులకు ప్రభుత్వానికి ఆదాయం రావడం ఇష్టం లేదేమో.. అనే అభిప్రాయం సర్వత్ర వ్యక్తం అవుతుంది. అక్రమ లేఅవుట్లు, అనుమతులే లేని భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ నిర్మాణ దారులు, అధికారులు సమన్వయంతో సర్దుకుపోతున్నారనే భావన అందరిలోనూ వ్యక్తం అవుతుంది. పంచాయతీ పరిధిలో (దిబ్బపాలెం రోడ్డులో) ఎటువంటి అనుమతులు లేకుండానే లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయిస్తున్న వైనంపై గత ఏడాది డిసెంబర్ 25 న" పాపం ఆ ఈఓ సమయం లేదట"అనే శీర్షికతో "అనధికారిక నిర్మాణాలపై చర్యలు తీసుకోరట"అనే ఉపశీర్షికతో విశాలాంధ్రలో కథనం వచ్చింది. కథనం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్న అధికారులు స్పందించకపోవడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. దర్జాగా ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి కొట్టి అక్రమ లేఔట్ వేసి ప్లాట్లు విక్రయించి కొనుక్కున్న వ్యక్తులు అక్కడ భారీ నిర్మాణాలు చేపడుతున్న కూడా అధికారులకు చీమకుట్టినట్లైనా లేకపోవడం విశేషం. నాలుగు నెలల క్రితం వచ్చిన కథనానికి ఇప్పటివరకు ఖండన ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి తార్కానంగా నిలుస్తుంది.. ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా... చూస్తూ సహకరిస్తారో వేచి చూడాలి...!